వాహనదారులు ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న టీటీఐ ఏసీపీ వెంకటేశ్వర్లు తదితరులు

అబిడ్స్‌: వాహనదారులు ట్రాఫిక్‌ నిబంధనలు పాటిస్తే ఎలాంటి సమస్యలు దరిచేరవని బేగంపేట టీటీఐ ఏసీపీ ఎస్‌.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రోడ్డు భద్రతపై అబిడ్స్‌లోని అరోరా పీజీ కాలేజ్‌ విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీఐ ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సోషల్‌ మీడియా రీల్స్‌ కోసం కొంత మంది విద్యార్థులు, యువత స్పోర్ట్స్‌ బైక్‌పై విన్యాసాలు చేస్తూ ప్రాణాలు సైతం పోగొట్టుకుంటున్నారన్నారు. ఎవరైనా పబ్లిక్‌ మార్గంలో ర్యాష్‌గా, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి మానవాళికి హాని కలిగించడం నేరమన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పని సరిగా డ్రైవింగ్‌ లైసెన్స్‌ తీసుకోవాలని ఏసీపీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పవర్‌ పాయింట్‌ ప్రజంటేషన్‌ ద్వారా దాదాపు 400 మంది విద్యార్థులకు అవగాహన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ రాంచందర్‌, కృష్ణ, అబ్దుల్‌ మాజీద్‌, హీరో మోటో కార్స్‌ సూపర్‌వైజర్‌ శ్రవణ్‌కుమార్‌, ప్రిన్సిపాల్‌ ప్రదోష చంద్రపట్నాయక్‌, హెచ్‌ఓడీలు దీపికా, విజయశ్రీ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్‌ ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలి



బీసీ సంక్షేమ భవన్‌ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్‌.కృష్ణయ్య, వేముల రామకృష్ణ తదితరులు

విజయనగర్‌కాలనీ: అభివృద్ధి ముసుగుతో కమీషన్‌లు దండుకోవడానికి మూసీ సుందరీకరణ చేపడుతున్నారని మాజీ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్‌.కృష్ణయ్య ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. మూసీ సుందరీకరణ వద్దు.. రాష్ట్రంలో నూతన విద్యావిధానం తేవడంతో పాటు ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. 16 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించడంతో పాటు స్కాలర్‌షిప్‌లు పెంచాలని డిమాండ్‌ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం సంక్షేమ భవన్‌ ముందు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌.కృష్ణయ్య పాల్గొని మాట్లాడుతూ..పెరిగిన ధరల ప్రకారం 16 లక్షల మంది కళాశాల విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను రూ.5500 నుంచి రూ.20 వేల వరకు పెంచడంతో పాటు విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ.4 వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. వేముల రామకృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని, విద్యార్థులతో పెట్టుకుంటే పతనం తథ్యమని అన్నారు. ఈ ధర్నాలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు నీల వెంకటేష్‌, పగిళ్ల సతీష్‌, అనంతయ్య, శివకుమార్‌, రాందేవ్‌, బలరాంనాయక్‌, బాలయ్య, రాజేందర్‌, రవియాదవ్‌, ప్రభాకర్‌ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రార్థన స్థలాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

గోల్కొండ: ప్రార్థన స్థలాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి పోలీసులు అవసరమైన చర్యలు తీసుకోవాలని కార్వాన్‌ నియోజకవర్గం కాంగ్రెస్‌ ఇన్‌చార్జీ ఉస్మాన్‌ బిన్‌ మహ్మద్‌ హాజీరి అన్నారు. శుక్రవారం ఆయన కాంగ్రెస్‌ నాయకులతో కలిసి గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో గోల్కొండ డివిజన్‌ ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. గత వారమే తాను డివిజన్‌ పరిధిలోని గోల్కొండ, లంగర్‌హౌస్‌ పోలీస్‌స్టేషన్లకు చెందిన ప్రార్థన స్థలాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో సీసీ కెమెరాల ఏర్పాటు అవశ్యకతపై వివరించామన్నారు. బోనాలు, వినాయక చవితి, శరన్నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్‌ నాయకులు ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌, గోల్కొండ ఇన్‌స్పెక్టర్‌ సైదులును సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు కురాకుల కృష్ణ, చంటిబాబు, ఆజామ్‌ ఖాన్‌, ఇమ్రాన్‌ అలీఖాన్‌, శోభాపాండే తదితరులున్నారు.



గోల్కొండ డివిజన్‌ ఏసీపీని సన్మానిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

బీజేపీ మహాధర్నాకు తరలిన నేతలు



మహాధర్నాలో బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్‌ తదితరులు

గోల్కొండ: పేదల ఇళ్లు కూల్చడమే లక్ష్యంగా పెట్టుకున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం త్వరలోనే కూలిపోవడం ఖాయమని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్‌ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం గుడిమల్కాపూర్‌ నుంచి మూసీ నిర్వాసితులకు మద్దతుగా ఇందిరాపార్కు ధర్నా చౌక్‌ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున తరలివెళ్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవర శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. ఎన్నికల హామీని పూర్తి చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి ఘోరంగా విఫలమైయ్యారన్నారు. దశాబ్దాలుగా ఇళ్లు కట్టుకున్న పేద, బడుగు ప్రజల ఇళ్లు కూల్చడానికి ముఖ్యమంత్రికి అధికారం ఎవరు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు.

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

గోల్కొండ: చెట్ల కొమ్మలు తొలగింపు, మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని అధికారులో ఓ ప్రకటనలో తెలిపారు. ఆసిఫ్‌నగర్‌ సబ్‌స్టేషన్‌ ఎస్‌ఎస్‌ఎఫ్‌ కాలనీ 11 కేవీ ఫీడర్‌ పరిధిలోని సూర్యనగర్‌, బాల్‌రెడ్డినగర్‌, విరాసత్‌నగర్‌, ఓవైసీ కాలనీ, ఎండిలైన్స్‌, అక్బర్‌ పురా తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11.30 వరకు విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. అదే విధంగా కాకతీయనగర్‌ ఫీడర్‌ పరిధిలోని కాకతీయనగర్‌, సాలార్‌జంగ్‌ కాలనీ, శ్మశానవాటిక, మిలట్రీ ఏరియా తదితర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌ ఉండదు. ఐటీఐ మల్లేపల్లి సబ్‌స్టేషన్‌ జహరామసీద్‌ ఫీడర్‌ పరిధిలోని హ్యూమాన్‌నగర్‌, విజయనగర్‌ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, కైలాష్‌నగర్‌ శ్మశానవాటిక, దేవుడి కుంట, లేబర్‌ అడ్డా, కేజీఎన్‌ హోటల్‌ ఏరియా, క్యాజిల్‌ హిల్స్‌, ఐడిఆర్‌ బిటీ రోడు తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగల ముఠా అరెస్ట్‌

ఆరు ద్విచక్రవాహనాలు స్వాధీనం

గన్‌ఫౌండ్రీ: నగర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న నేరస్తులను శుక్రవారం స్పెషల్‌జోన్‌ క్రైమ్‌ టీమ్‌ అరెస్టు చేసింది. వారి వద్ద నుంచి రూ.4 లక్షలు విలువ చేసే ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం..మీర్‌చౌక్‌కు చెందిన అలీ అబ్బాస్‌ (21) వాటర్‌ప్లాంట్‌లో పనిచేస్తూ ద్విచక్ర వాహనాలను దింగిలించే వాడు. యాకుత్‌పురా, దారుషిఫా ప్రాంతాలకు చెందిన మరో ముగ్గురు మైనర్‌ బాలురలతో కలిసి హైదరాబాద్‌లోని మూడు కమిషనరేట్‌ పరిధులలో పలు ద్విచక్రవాహనాలను దొంగిలించారు. వారి వద్ద నుంచి ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని తదుపరి విచారణకు అఫ్జల్‌గంజ్‌ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. అఫ్జల్‌గంజ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో హోండా షైన్‌ (టీఎస్‌11ఈఆర్‌6852), వారాసిగూడ పీఎస్‌ పరిధిలో (టీఎస్‌10ఈడీ8433), హుస్సేనిఆలం పీఎస్‌ పరిధిలో (టీఎస్‌12ఈకే5216), నాచారం పీఎస్‌ పరిధిలో (టీఎస్‌08ఎఫ్‌టీ9242), మియాపూర్‌ పీఎస్‌ పరిధిలో (టీఎస్‌07ఎఫ్‌జెడ్‌4161), పహాడీషరీఫ్‌ పీఎస్‌ పరిధిలో (ఏపీ28ఏఎఫ్‌2537) నెంబర్‌ గల ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేరస్తులను పట్టుకున్న పోలీస్‌ సిబ్బందిని అభినందించారు.

కుంచె పడితే చిత్రాలకు ప్రాణం

సుల్తాన్‌బజార్‌: కాండూరి కృష్ణమాచారి వృత్తి దేవాదాయ శాఖలో జూనియర్‌ అసిస్టెంట్‌. కాగా చిత్రలేఖనం ప్రవృత్తిగా మార్చుకున్నాడు. సమాజ సేవలో తనవంతు కృషి చేస్తూనే ఉద్యోగరీత్యా తన బాధ్యతలు నిర్వహించుకుంటూ దేవాదాయ శాఖలో అర్చక ఉద్యోగుల సమస్యలపై తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ అధ్యక్షుడిగా వివిధ సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్న కృష్ణమాచారి ఉద్యమ నాయకుడిగా ఉంటూ చిత్రకారుడిగా ఎన్నో అద్భుత చిత్రాలను గీస్తూ ఓ కళాకారుడిగా సైతం రాణిస్తున్నారు. ఓ చిత్రకారుడిగా సీఎం రేవంత్‌రెడ్డి నుంచి మంత్రులు, ప్రముఖులు, సినిమా హీరోలు, తనకు నచ్చిన అధికారులు, సాహితీవేత్తలు, ప్రకృతి అందాలు, కళాఖండాలు, ఎన్నో చిత్రాలను గీస్తూ తనలోని ప్రతిభను చాటుతున్నారు.

ఖాళీ సమయాల్లో వివిధ చిత్రాలు గీస్తూ..

బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిపెరిగిన ఆయన విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు ఒంటపట్టడంతో విద్యార్థి నాయకుడిగా, వివిధ రాజకీయ పార్టీల నాయకుడిగా ప్రజలకు సేవలందించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖలో ఉద్యోగం వచ్చిన తర్వాత ఉద్యోగుల నాయకుడిగా ఇప్పటికీ తన పోరాట పటిమను చాటుతూనే ఉన్నారు. అర్చక జేఏసీ అధ్యక్షుడిగా ప్రభుత్వాలతో పోరాటం చేస్తూనే తన బాధ్యతను కొనసాగించడం విశేషం. ఆయనలో ఉన్న చిత్రకారుడికి విరామం ఇవ్వకుండా ఖాళీ సమయాల్లో వివిధ చిత్రాలను గీస్తూ వారికి బహూకరించడం ఆయన దినచర్యలో భాగమైంది.





చిత్రలేఖనం ఎగ్జిబిషన్‌ చేయడమే లక్ష్యం..



“ నేను గీసిన చిత్రలేఖలను ఉచిత ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయాలన్నదే నా ఆశయం. ఇప్పటికే ఎంతో మంది ప్రముఖుల చిత్రాలను గీసి వారికి బహూకరించాను. నేను గీసిన కళాఖండాలు ప్రకృతి అందాలు, జలపాతాలు, ఇతరాత్ర కళాఖండాల చిత్రాలతో ఎగ్జిబిషన్‌ ఏర్పాటు చేస్తాం. అంతేకాకుండా సామాజిక సేవా కార్యక్రమాలలో కృషి చేస్తున్నా. తన కుటుంబం అండతో మునుముందు మరింత మెరుగైన చిత్రాలను గీసేందుకు ప్రయత్నం చేస్తా.

–కాండూరి కృష్ణమాచారి, చిత్రకారుడు

మౌలిక సదుపాయాలు కల్పించండి



ఉషాకన్న

నాంపల్లి: బస్తీ దవాఖానాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని సామాజిక కార్యకర్త, హైదరాబాద్‌ పార్లమెంట్‌ సెగ్మెంట్‌ కాంటెస్టెడ్‌ ఎంపీ అభ్యర్థి అందె ఉషాకన్న ఆరోపించారు. శుక్రవారం కట్టెలమండిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బస్తీ దవాఖానాలు దగాఖానాలుగా మారిపోయినట్లు విమర్శించారు. ఈ దవాఖానాల్లో రోగులకే కాదు, ఆసుపత్రుల్లో పనిచేసే సిబ్బంది తాగడానికి కూడా మంచినీళ్లు లేవని, కనీసం మరుగుదొడ్లు లేవని ఆరోపించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. జియాగూడ ఎంసీహెచ్‌ క్వార్టర్స్‌ దవాఖానాలో పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. తక్షణమే బస్తీ దవాఖానాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. లేదంటే ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు.

మజ్లిస్‌, కాంగ్రెస్‌ పోరుతో కుంటుపడుతున్న అభివృద్ధి!

గోల్కొండ: నాంపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మహ్మద్‌ మాజీద్‌ హుస్సేన్‌, కాంగ్రెస్‌ నాయకుడు ఫిరోజ్‌ఖాన్‌ అనుచరుల మధ్య వీధి పోరాటాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. గత కొన్ని రోజుల క్రితం హుమాయున్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయంపై ఎమ్మెల్యే మాజీద్‌ హుస్సేన్‌, ఫిరోజ్‌ఖాన్‌ మధ్య మాటామాటా పెరిగి వీధిపోరాటానికి దారి తీసింది. ఆ రోజు నుంచి అహ్మద్‌నగర్‌, మెహిదీపట్నం, విజయ్‌నగర్‌ కాలనీ, మురాద్‌నగర్‌, ఆసిఫ్‌నగర్‌ తదితర ప్రాంతాల్లో ఆధిపత్య పోరాటం కోసం మజ్లిస్‌, కాంగ్రెస్‌ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. కాగా శుక్రవారం ఎమ్మెల్యే మాజీద్‌హుస్సేన్‌, కాంగ్రెస్‌ నాయకుడు ఫిరోజ్‌ఖాన్‌ పంచాయితీ నగర పోలీస్‌ కార్యాలయంలో జరగడం విశేషం.

ప్రార్థనలు ప్రశాంతం



శాలిబండ: మక్కా మసీదులో శుక్రవారం సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. ఈ ప్రార్థనల్లో పత్తర్‌గట్టి కార్పొరేటర్‌ సోహేల్‌ ఖాద్రీ, మాజీ కార్పొరేటర్‌ మోసిన్‌ బలాలతో పాటు పెద్ద సంఖ్యలు ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దక్షిణ మండలం పోలీసుల ఆధ్వర్యంలో మక్కా మసీదు–చార్మినార్‌ పరిసర ప్రాంతాల్లో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

జీహెచ్‌ఎంసీ ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగి అదృశ్యం



లక్ష్మణ్‌

అబిడ్స్‌: జీహెచ్‌ఎంసీ ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగి అదృశ్యమైన ఘటన సైఫాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలబస్తీకి చెందిన లక్ష్మణ్‌(43) జీహెచ్‌ఎంసీ ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగి. అతని భార్య గీతాబాయి గుడిమల్కాపూర్‌ మహేష్‌నగర్‌లో ల్యాండ్రీ షాపు నిర్వహిస్తుంది. ఆగస్టు 22న భార్య గీతాబాయికి జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి వెళ్తునని చెప్పి వెళ్లిన లక్ష్మణ్‌ తిరిగి రాలేదు. రెండు నెలల పాటు అతని కోసం గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

చాంద్రాయణగుట్ట: పార్టీ కోసం కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందని చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి బోయ నరేష్‌ అన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌ కుమార్‌గౌడ్‌ ఆదేశాను సారం నియోజకవర్గం పార్టీ నాయకుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..త్వరలోనే ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. పదేళ్లుగా పార్టీ పటిష్టం కోసం కృషి చేసిన వారి సేవలను గుర్తించాలని అధిష్టానం సూచించిందన్నారు. సీనియర్‌ నాయకులు బి.వెంకటేష్‌ ముదిరాజ్‌, డి.ఎల్‌.నర్సింగ్‌ గౌడ్‌, రుక్మిణీ నాయక్‌, ప్రమోద్‌రెడ్డి, కాశమోని శ్యాంరావు ముదిరాజ్‌, ద్వారక్‌, మహేష్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌ ఎదుట డీవైఎఫ్‌ఐ నిరసన



చాంద్రాయణగుట్ట: డీవైఎఫ్‌ఐ హైదరాబాద్‌ సౌత్‌ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫలక్‌నుమా రైల్వేస్టేషన్‌ ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్‌ మాట్లాడుతూ..రైల్వేలో సిబ్బంది కారణంగా రిటైర్డ్‌ ఉద్యోగులను మళ్లీ తాత్కాలికంగా విధుల్లోకి తీసుకోవడం సిగ్గు చేటన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ జోన్లలో 25 వేల ఖాళీల భర్తీకి రిక్రూట్‌మెంట్‌ డ్రైవ్‌ను ప్రారంభించిన యువతను విస్మరించిందన్నారు. రైల్వే ప్రమాదాల నివారణ, ఉద్యోగులపై పని ఒత్తిడి లేకుండా చూడాలన్నారు. ఇప్పటికే కేంద్ర రంగ సంస్థలైన బీఎస్‌ఎన్‌ఎల్‌, రైల్వే, ఎల్‌ఐసీ, బొగ్గు గనులను ప్రైవేట్‌ పరం చేస్తుండడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణా నాయక్‌, శ్రీను, మహేష్‌, భరత్‌, మురారీ, గోపాల్‌, భరత్‌, సురేష్‌, గోపాల్‌ పాల్గొన్నారు.

‘కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకురావాలి’



గౌరీ సతీష్‌

అఫ్జల్‌గంజ్‌: మూసీ సుందరీకరణకు కేంద్ర బీజేపీ మంత్రులు, బీజేపీ ఎంపీలు ప్రధాని నరేంద్రమోదీని ఒప్పించి ప్రత్యేక నిధులు తీసుకురావాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్‌ పేర్కొన్నారు. లక్షలాది కుటుంబాలకు ఎంతో మేలు జరిగే మూసీ సుందరీకరణను బీజేపీ అగ్ర నాయకులు, బీజేపీ ప్రజా ప్రతిధులు వ్యతిరేకించడం దారుణమన్నారు. ప్రజల కోసం, మూసీ వెంట నల్గొండ జిల్లా వరకు మూసీ సుందరీకరణ చేపడితే స్వచ్ఛమైన నీటితో లక్షలాది కుటుంబాలకు పంటలు పండడంతో పాటు నీళ్లు తాగడానికి కూడా ఎంతో వీలు కలుగుతుందన్నారు. ప్రజలకు లబ్ధి చేకూరే మూసీ సుందరీకరణను బీజేపీ నాయకులు అడ్డుకోవడం మానేసి నిధుల కోసం కేంద్రంతో పోరాటం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాని నరేంద్రమోదీని ఒప్పించి ప్రత్యేక నిధులు బీజేపీ నాయకులు తెస్తే మూసీ పరీవాహక ప్రజలే కాక ఇతర వారంతా వారిని మెచ్చుకుంటారని గౌరీ సతీష్‌ అన్నారు. ఇకనైనా చిల్లర రాజకీయాలు బీజేపీ నాయకులు మాని ప్రజా సంక్షేమం కోసం, ప్రజాభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మూసీ రివర్‌ ఫ్రంట్‌ సుందరీకరణ నిధుల కోసం కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అలరించిన పౌరాణిక పద్య నాటకోత్సవం



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కల్పన కళానికేతన్‌ ఆధ్వర్యంలో గురు పంచక వందన పౌరాణిక పద్య నాటకాన్ని శుక్రవారం రవీంద్రభారతిలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి డాక్టర్‌ ఎస్‌కే.రాము మాట్లాడుతూ..నేటి తరానికి పద్య నాటకాలను నేర్పించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అంతకు ముందు సినీ సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా పలువురు పౌరాణిక కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత జడ్జి నాగ మారుతి శర్మ, న్యాయవాది భార్గవ శర్మ, ఆధ్యాత్మిక వేత్త నాగభూషణం, సంస్థ అధ్యక్షులు దొంతి జంగయ్య గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

‘మజ్లిస్‌ పార్టీకి తరగని ప్రజాభిమానం ఉంది’



మజ్లిస్‌ ఏరియా కమిటీ ప్రతినిధులతో ఎమ్మెల్యే కౌసర్‌

గోల్కొండ: మజ్లిస్‌ పార్టీకి తరగని ప్రజాభిమానం ఉందని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకీలో మజ్లిస్‌ ఏరియా కమిటీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు, పార్టీకి మజ్లిస్‌ ఏరియా కమిటీలు వారధిలాంటివన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరాలను కార్పొరేటర్‌కు, ఎమ్మెల్యేకు తెలియజేయడానికి మజ్లిస్‌ అధిష్టానం ఏరియా కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. అదే విధంగా మజ్లిస్‌ ఏరియా కమిటీ వారు శాంతిభద్రతల పరిరక్షణ కోసం కూడా నిరంతరం పని చేస్తారన్నారు. కార్యక్రమంలో అలీముద్దీన్‌, సయ్యద్‌ రఫత్‌ హుస్సేన్‌, మజీద్‌, ఖదీర్‌ తదితరులున్నారు.

3న సామూహిక సత్యనారాయణ వ్రతం

జియాగూడ: కార్తీకమాసం మహా పర్వాన్ని పురస్కరించుకొని సత్యనారాయణ స్వామి కథను సామూహికంగా 108 మండపాలతో సంగీత (ఢంకా)పై నిర్వహిస్తామని మహారాణా ప్రతాప్‌ సేవా సమితి తెలంగాణ రాష్ట్ర ఫౌండర్‌ అధ్యక్షుడు విజయ్‌ ధినేష్‌ సింగ్‌ ఠాకూర్‌, ప్రధాన కార్యదర్శి ఠాకూర్‌ విపిన్‌రాజ్‌ సింగ్‌ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం అత్తాపూర్‌ పాండురంగానగర్‌లోని సమితి కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. అత్తాపూర్‌, రాంబాగ్‌, రాంమందిర్‌, సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహించే సామూహిక సత్యనారాయణ స్వామి కథ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ప్రముఖ కథ విశ్లేషకులు పండిట్‌ హరి ఓం మహారాజ్‌ నిర్వహిస్తారన్నారు. న్యాయ సలహాదారులు గోపాల్‌ సింగ్‌, సలహాదారులు నర్సింగ్‌ ఠాకూర్‌, అర్జున్‌ సింగ్‌, ఉపాధ్యక్షులు టి.దిలీప్‌ సింగ్‌, నరేందర్‌ సింగ్‌, జీవన్‌ సింగ్‌, రాజ్‌ కిశోర్‌సింగ్‌, మహేందర్‌ సింగ్‌, కోశాధికారి మనోజ్‌ సింగ్‌, కార్యదర్శులు రాంసింగ్‌, ఉపేందర్‌ సింగ్‌, వికాస్‌ సింగ్‌, కుమార్‌ గౌరో ప్రతాప్‌ సింగ్‌, సహ కార్యదర్శి నరేందర్‌ సింగ్‌, ఉమేష్‌ సింగ్‌, ఆర్గనైజింగ్‌ కార్యదర్శులు రోహిత్‌ సింగ్‌, కుల్‌దీప్‌ సింగ్‌, రిత్విక్‌రాజ్‌ సింగ్‌, కార్యవర్గ సభ్యులు ఆశీష్‌ సింగ్‌, రితిక్‌ సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

జోనల్‌ కమిషనర్‌కు సన్మానం



చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్‌ డివిజన్‌లోని అంబేద్కర్‌నగర్‌ బస్తీలో ఇటీవల డ్రైనేజీ పైప్‌లైన్లు, సీసీ రోడ్లు వేసినందుకు అంబేద్కర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ తరపున జీహెచ్‌ఎంసీ చార్మినార్‌ జోన్‌ జోనల్‌ కమిషనర్‌ టి.వెంకన్నను శుక్రవారం సన్మానించారు. అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి గోడ ఈశ్వర్‌, చీఫ్‌ అడ్వయిజర్‌ బోయినీ విజయ్‌ కుమార్‌ సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.

బ్యాడ్మింటన్‌లో సత్తాచాటిన శాన్వి

గన్‌ఫౌండ్రీ: అస్సాంలో జరుగుతున్న అండర్‌–13 అఖిలభారత సబ్‌ జూనియర్‌ ర్యాంకింగ్‌ బ్యాడ్మింటన్‌ టోర్నమెంట్‌లో నగరానికి చెందిన క్రీడాకారిణి శాన్వి లట్టాల అద్భుత ప్రతిభను కనబరిచింది. శుక్రవారం మ్యాచ్‌ పాయింట్‌ బ్యాడ్మింటన్‌ అకాడమీ చైర్మన్‌ ముప్పాల వేణు ఆమెను ఇండోర్‌ స్టేడియంలో అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 9 ఏళ్ల వయస్సు గల శాన్వి తన కంటే పెద్దవాళ్లు అయిన క్రీడాకారులతో తలపడి మెయిన్‌ డ్రాకు అర్హత సాధించడం ఎంతో అద్భుతమని కొనియాడారు. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ క్రీడాకారులు జేబీఎస్‌ విద్యాధర్‌, బి.లింగేశ్వర్‌రావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్కళాభారతి వార్షికోత్సవం

గన్‌ఫౌండ్రీ: సత్కళాభారతి 28వ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 26న రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతి స్వామి, ప్రభుత్వ పూర్వ సలహాదారులు కేవీ.రమణాచారితో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 100 మంది వేద పండితులకు ఘనంగా సత్కారం చేయనున్నట్లు తెలిపారు.

సీఎంను కలిసిన న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య, నాయకులు

యాకుత్‌పురా: తెలంగాణ రాష్ట్ర న్యాయశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌.వీ సుబ్బయ్య ఆధ్వర్యంలో నాయకుల బృందం శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి న్యాయశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ..న్యాయశాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సీఎంకు వివరించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు.

న్యూసెన్స్‌ కేసులో రౌడీషీటర్‌కు జైలు




షేక్‌ షరీఫ్‌

గౌలిపురా: మద్యం మత్తులో న్యూసెన్స్‌ చేసిన ఓ రౌడీషీటర్‌ను శుక్రవారం నాంపల్లిలోని కోర్టులో హాజరుపరచగా స్పెషల్‌ జ్యూడిషియల్‌ మెజిస్ట్రేట్‌ డి.సి.ఉమాపతి రావు నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. భవానీనగర్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..సంతోష్‌నగర్‌కు చెందిన రౌడీషీటర్‌ షేక్‌ షరీఫ్‌ (30) భవానీనగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఇటీవల మద్యం సేవించి స్థానికంగా న్యూసెన్స్‌ చేస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న భవానీనగర్‌ పోలీసులు షేక్‌ షరీఫ్‌ను అరెస్ట్‌ చేసి కేసు నమోదు చేసుకొని శుక్రవారం కోర్టు హాజరుపరచగా..పూర్వపరాలను పరిశీలించిన స్పెషల్‌ జ్యూడిషియల్‌ మెజిస్ట్రేట్‌ డి.సి.ఉమాపతి రావు షేక్‌ షరీఫ్‌కు నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

నవంబర్‌ 24న వచన కవిత అధ్యయన శిబిరం

సుల్తాన్‌బజార్‌: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో నవంబర్‌ 24న వచన కవిత్వ అధ్యయన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ జె.చెన్నయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కవిత్వ రంగంలో కొంత కృషి చేసిన వారికి వస్తు, శిల్ప పరమైన శిక్షణ ఇచ్చేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కవులు ఇప్పటి వరకు వెలువరించిన కవితల వివరాలు తెలియజేస్తూ మచ్చుకు ఒక కవితను 96037 27234 వాట్సాప్‌ నెంబర్‌లో పంపి నమోదు చేసుకోవాలని సూచించారు. సీనియర్‌ కవులు, విమర్శకులు, ఈ శిబిరంలో కవిత్వ నిర్మాణ పద్ధతుల గురించి కవిత్వంలో ఉండాల్సిన ప్రామాణిక అంశాల గురించి వివరిస్తారని డాక్టర్‌ జె.చెన్నయ్య తెలిపారు.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు



గోల్కొండ: కూరగాయల ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. వారం రోజుల నుంచి కూరగాయల ధరలు రోజురోజుకూ పెరుగుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆందోళన కలిగిస్తున్నాయి. మెహిదీపట్నంలోని రైతుబజార్‌తో పాటు గుడిమల్కాపూర్‌లోని కూరగాయల మార్కెట్‌లో సైతం కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ఒక టమాట తప్పితే ఇతర కూరగాయలన్నీ కిలో రూ.80 నుంచి 160 వరకు అమ్ముతున్నారు. బీన్స్‌ రూ.170, చిక్కుడు రూ.120, అదే విధంగా వివిధ రకాల వంకాయలు సైతం కిలో రూ.70–80 వరకు అమ్ముతున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684